# ఆత్మధర్మమే స్వధర్మము

**ముక్తి కోరి నరుడు ముక్కోటి దేవతల**
**వేడుచుండు గాని వెతలు బోవు**
**తనదు లోని అహము తా చంపుకొన్న**
**వేరె ముక్తియేల! తానె ముక్తికాదె!**

**ప్రేమస్వరూపులారా!**

దృశ్యకల్పితమైన యీ జగత్తు త్రిగుణాల వికారమై, వికారముచేతనే నిర్మింపబడినది. త్రిగుణాత్మక వికారముచేతనే పోషింపబడుచున్నది. ఈ త్రిగుణాల వికారముచేతనే లయింపబడుతున్నది. ఈ ప్రపంచమునకు గుణములే ప్రాణములు. గుణములయొక్క కార్యకలాప సముదాయమే యీ ప్రపంచము. భగవత్ సేవాసక్తి, భక్తి, గుణవిరక్తులు మాత్రమే యీ త్రిగుణములను దాటించగలవు. అయితే, యిట్టి పవిత్రమైన గుణాతీతుడు కావలెనన్న అనాసక్తి, విరక్తి, ఉపేక్ష యీ మూడు ప్రధానమైన లక్షణములు మనము సంపాదించుకోవాలి.

**అనాసక్తిని సాధించిన మానవుడు సంసారములో తేలి ఆడుతాడు.**

అనాసక్తి అనగా యెట్టి యిచ్ఛను లేకుండాపోవటం. అయితే, దైవాసక్తి మాత్రం వుండాలి. అన్ని ఆసక్తులను నిర్మూలము గావించి దైవాసక్తిని మాత్రము అభివృద్ధి పొందించుకోవాలి. విరక్తి అనగా కేవలము సర్వసంపదలను వదలిపెట్టి ఆలుబిడ్డలను విస్మరించి కేవలము అరణ్యము చేరి తపస్సు గావించటము కాదు.

**భావమందు దుష్టభావము వీడుటె**
**త్యాగమగును అదియె యోగమగును**
**ఆస్తి ఆలి వీడి అడవి కేగుట కాదు.**

అన్ని మతములయందును నీవు ఆసక్తిని పెట్టవచ్చును. కాని, అది 'నాది' అనే

srisathyasaivachanamrutam

అభిమానమును మాత్రము అభివృద్ధి గావించుకోరాదు. ఇంక 'అపేక్ష' అనునది అన్ని పదార్థములను ఆశించునది. ఈ ఆశలు వుండినంతవరకు మానవుడు యథార్థమైన తత్త్వమును గుర్తించుకోలేడు. సమస్త పదార్థములు అతనిని ముంచివేయునేగాని తేల్చుటకు యేమాత్రము ప్రయత్నించవు. అనేకమందికి తెలిసివుండవచ్చును. పచ్చిసొరకాయను నీటిలో వేసినప్పుడు మునిగిపోతుంది. ఇదే సొరకాయ ఎండబెట్టిన తరువాత నీటిలో వేస్తే తేలిపోతుంది. ఆసక్తి వుండిన మానవుడు సంసారములో మునిగిపోతాడు. అనాసక్తిని సాధించిన మానవుడు సంసారములో తేలి ఆడుతాడు. ఇట్టి మానవునకు ముక్తి విషయమునందుకూడను ఆసక్తివుండదు. కాని, భక్తిని వదలడు. తనలక్ష్యమునంతాకూడను భగవంతుని చింతనయందే యిమిడ్చివుంటాడు. అట్టి మానవునియొక్క యోగక్షేమములు భగవంతుడు చూచుకుంటూ వుంటాడు. కారణమేమనగా విరక్తి, అనాసక్తిలతో కూడినవానియందు భగవంతునియొక్క అనుగ్రహము అతి నిండుగా, మెండుగా వుంటుంది. ఇట్టి మహత్తరమైన భాగ్యాన్ని పొందటమే ఒకయోగము. అట్టి యోగాన్ని పొంది సాధించినదానిని రక్షించుకోటమే క్షేమము. భగవదనుగ్రహమును సంపాదించుకోటమే గొప్పయోగము. సంపాదించుకున్న యీ మహాభాగ్యము కాపాడుకోటమే క్షేమము. దీనినే వేదాంత పరిభాషయందు ప్రాప్తాప్రాప్తములంటారు. ఈ ప్రాప్తాప్రాప్తమనే తత్త్వము మానవునియొక్క ప్రయత్నము ద్వారానే లభ్యమవుతుంది. అయితే యీ విధమైన ప్రాప్తికి మనము నోచుకొనటానికి కొన్ని రకములైన సాధనలు చెయ్యాలి.

**మానవుడు అజ్ఞానియై పుడతాడు, మరణించినప్పుడు జ్ఞానియై మరణించాలి**

జగత్తంతయుకూడను త్రిగుణములయొక్క స్వరూపమే! త్రిగుణములయొక్క వికారమే! త్రిగుణములయొక్క నాటకమే! సర్వము త్రిగుణాత్మక స్వరూపమే! అందులో మొదటి గుణమైన తమోగుణాన్ని మనము రూపుమాపాలి. తమోగుణమనగా మూర్ఖత్వము, మందమతి తత్త్వము. ఈ మూర్ఖపుబుద్ధి, మూర్ఖవాదనను మొట్టమొదట మనము అరికట్టుకోవాలి. విన్న విషయములను చక్కగా విచారణ చేసుకోవాలి. విచారణ చేసుకున్న విషయములను మనము జీర్ణించుకోవాలి. అలా జీర్ణించుకున్నప్పుడే ఆ శక్తి మనకు లభ్యమవుతుంది. ప్రతి

విషయమునందును వాదోపవాదములకు దిగరాదు. ఈ వాదములవల్ల వైరము అభివృద్ధి అవుతుందేగాని శాంతము చేకూరదు. సత్యాన్ని గుర్తించలేవు. కనుకనే తమోగుణము కల్గినవాడు సత్యమును గుర్తించలేడు. దివ్యత్వాన్ని చేరలేడు. పవిత్రాన్ని అనుభవించలేడు. వాని జీవితము నిరంతరము 'పునరపి జననం, పునరపి మరణం.'

ఇంక రజోగుణము అనేది తమ వాంఛలు నెరవేరెనా సంతృప్తి లేక అహం. తమ వాంఛలు విఫలమాయెనా తనకు క్రోధము. కోరికలు విఫలమైననూ లేక నెరవేరిననూ యీ రెండింటియందు యేదో ఒక దుర్గుణములే ఆవిర్భవిస్తున్నాయే కాని సరైన ఫలితము చేకూర్చటం లేదు. కోపతాపములచేతను, ఆవేశముల చేతను వారు మండిపడుతుంటారు. యీ రజోగుణమనేది నిరంతరము రక్తమును మలినముచేయు గుణమును అభివృద్ధిపరుస్తుంది.

సత్త్వగుణము మూడవది. ఇది కూడను ఒక బంధనే! దీనియొక్క పుణ్యఫలమును భగవంతునికి అర్పితము గావించుటమువల్లనే యిది సార్థకమవుతుంది. తమోగుణమునకు ఒక రంగు ఉన్నది, అదే నలుపు. తమస్సనగా చీకటి. అజ్ఞానము అని. ఈ చీకటికి నలుపు ప్రధానమైన గుర్తు. రజోగుణము వుద్రేకములచేత, ఆవేశములచేత కొంతవరకు దేహములో వుండిన రక్తమును వేడెక్కించి దేహమంతయు సరఫరాచేసి ముఖములో యెర్రని రంగు ఏర్పడుతుంది. కన్నులు కూడను యెఱ్ఱని రంగుగా మారిపోతుంటాయి. కనుక రజోగుణమునకు స్వస్వరూపమైనది ఎరుపు. ఇంక సాత్త్వికము .ఇది పరిశుద్ధమైనది. నిర్మలత్వమునకు పరిశుద్ధమైన తెలుపు రంగు గుర్తు. యీ జగత్తులోపల జన్మించిన ప్రతి జీవికూడను సత్త్వరజోతమో గుణముల మిశ్రమమే! ఈ గుణములనుబట్టి క్రియలుకూడను సలుపుతూ వస్తుంటారు. దీనిని పురస్కరించుకొనియే గుణకర్మ విభాగములని చేశారు. మానవుడు పుట్టినప్పుడు అజ్ఞానియై పుడతాడు. మరణించినప్పుడు జ్ఞానియై మరణించాలి.

**అనేకత్వములోని ఏకత్వమును గుర్తించటమే బ్రహ్మజ్ఞానము**

ఈ గుణ, కర్మ విభాగమును పురస్కరించుకొనియే చాతుర్వర్ణము అనేది నిర్మాణమవుతూ వచ్చింది. ఈ మూడు గుణములను పురస్కరించుకొనియే మూడు మతములుగా యేర్పడుతూ వచ్చింది. మూర్ఖులైనవారి గుంపు ఒకటి. కోపతాపములతో వుద్రేక పడేవారు ఒకటి.

sri sathyasai vachanamrutam

సర్వసంగ పరిత్యాగులై శుద్ధ సత్త్వస్వరూపులైన వారి మతము మరొకటి. తమోగుణమనేది మూర్ఖత్వముగాను, మందమతి గల్గినవాడు శూద్రుడు అని చెప్పారు. వీరునిగా, ధీరునిగా, రౌద్రునిగా రూపొందేవానిని క్షత్రియుడు అని చెబుతూ వచ్చారు. భగవద్భక్తి, దైవానురక్తి కలిగి పవిత్రమైన శుద్ధసత్త్వముతో కూడిన విపులమైన గుణములు కలిగినవారిని బ్రాహ్మణులు అని చెబుతూ వచ్చారు. ఈ గుణకర్మలచేతనే వర్ణవ్యవస్థ ఏర్పడుతూ వచ్చింది. కాని, యీ పవిత్రమైన సత్యమును, ధర్మమును గుర్తించుకొనలేక మానవుడు వక్ర మార్గమును అనుభవిస్తూ వచ్చాడు. ఈనాడు కులమత భేదములచేత కేవలము కుక్కలు చించిన విస్తరాకువలె మానవత్వాన్ని ముక్కలు ముక్కలుగా చేయటానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో ఒకటి గొప్ప, ఒకటి చిన్న అని విభేదము చేయటానికి వీలులేదు. ఒకటి ఉన్నతమైనది, ఒకటి అధమమైనదని నిర్ణయించటానికి సాధ్యము కాదు. దీనికి చక్కని ఉపమానము. అంతకు పూర్వము ఒకేదానిగా వుండిన వేదవిజ్ఞాన సర్వస్యమును వ్యాసమహర్షి నాలుగు వేదములుగా విభజించాడు. ఈ విభజించిన నాలుగు వేదములలో ఒకవేదము గొప్పది రెండవ వేదము చిన్నది అని ఎవరు విమర్శించటానికి వీలు లేదు, కాదు. వేదములు నాలుగూ సమానమే! వేదములు నాలుగూ పవిత్రమే! వేదములు నాలుగూ స్వార్థరహితమైన కర్మలు ఆచరింపజేసేవే! అదేవిధముగానే గుణకర్మములు విభజించటంచేత ఒకటి చిన్నది ఒకటి పెద్దది ఒకటి మధ్యమముది అనే నిర్ణయము చేయటానికి ఎవరికి అధికారము లేదు. ఇది కేవలము సంకుచితమైన భావములచే ఏర్పడినదే! దీనిని సమర్థింప చేసుకొనే శక్తి సామర్థ్యములు లేకపోవటంచేత మానవుడు యిట్టి వికారబుద్ధులతో వక్రమార్గాన్ని అనుసరిస్తున్నాడు.

**శాస్త్రంబునెప్పుడు సత్యంబుగా నమ్ము**
**వేద సమ్మతమగు విప్రులారా!**

ఎవరీ బ్రాహ్మణులు? శాస్త్రములే సత్యముగా విశ్వసించి దానిని అనుసరించి దాని ఆచరణయందు తమ జీవితము అంత్యము గావించుకొనేవారు, బ్రాహ్మణులు అన్నారు. అతను ఎవరైనా కావచ్చును. కేవలము జన్మ బ్రాహ్మణులనే కాదు, కర్మ బ్రాహ్మణులను సరైన ఆదర్శముగా తీసుకోవాలి. అందువలనే గుణకర్మ విభాగము. గుణమును, కర్మను ఆశ్రయించి దీనికి

sri sathyasai vahini amrutam

విభాగము చేస్తూ వచ్చారు. ఋక్కులనంతా వేరుచేసి ఋగ్వేదమని, యజుస్సును వేరుచేసి యజుర్వేదమని, సామమును వేరుచేసి సామవేదమని ఏవిధముగా విభాగము చేసినారో అదేవిధముగానే తమోగుణమును పురస్కరించుకొని, రజోగుణమును పురస్కరించుకొని, సాత్త్వికమును పురస్కరించుకొని ఆయా తెగలను ఏర్పరుస్తూ వచ్చారు. నిజానికి ఋక్కులకంటె సామములు వేరైనవా? ఉన్నతమైనవా? సామమునందును, యజుస్సునందును, అథర్వణమందును యీ ఋక్కులనే మంత్రములు సమముగానే చేరివుంటున్నాయి. ఇందులో భావశుద్ధి ప్రధానమేగాని బాహ్యశుద్ధి కాదు. గుణములు ప్రధానమేగాని స్థలములు, కులములు కాదు ప్రధానము. కర్మలు ప్రధానముగానీ మర్మములు కాదు. కనుకనే గుణకర్మలచేత ఏర్పడిన యీ పవిత్రమైన మతమునందు ఒకరు హీనులు, ఒకరు ఉత్తములని ఎవ్వరూ నిర్ణయించటము సాధ్యము కాదు.

**దేశంబు కొరకునై దేహమర్పణచేసి**
**రహియించు రాజాధిరాజులారా!**

ఈ దేశ నిమిత్తమై ఎవరు తమ ప్రాణమును, తమ దేహమును అంత్యము గావింతురో వారందరు క్షత్రియులే! దేశరక్షణ, దేహరక్షణే! ఎందుకనగా 'జననీ జన్మభూమిశ్చ.....' అని తల్లి, తన జన్మభూమి ఎంత ప్రధానమైనవో తన దేశము, తన దేహము అంత ఆధారమైనవి. ఇవి కేవలము బింబ, ప్రతిబింబములవంటివి. దేశరక్షణే తన దేహరక్షణ. ఇట్టి భావములచే దేశరక్షణ నిమిత్తమై తన దేహమును అర్పితము గావించినవాడు, క్షత్రియుడు అన్నారు. ఈ పవిత్రమైన త్యాగము ఎవరైనా చేయవచ్చును.

**వ్యవసాయ వృత్తిచే నాహార మందించి**
**సుఖ జీవనము చేయు శూద్రులార!**

ప్రతి మానవునికి ఆహారము అత్యవసరము. ఈ ఆహారమునే ఉత్పత్తి గావించకుండిన జగత్తే నిర్మూలమై పోతుంది. కనుక ఎవరెవరి కర్తవ్యమును వారు నిర్వర్తించుకుంటూ పోవటమే యీ గుణ కర్మ విభాగములో వుండే అంతరార్థమని మనము నిర్ణయించుకోవాలి. యీ విధమైన సత్యమైన, పవిత్రమైన సూత్రములను మనము సరైన మార్గములో ప్రచారము

srisatyasaivachanamrutam

చేయలేకపోవటంచేతనే యీనాడు దేశము యీ కులమత ద్వేషములచేత మానవత్వాన్ని నిర్మూలము గావించటానికి సిద్ధముగా వుంటున్నాది. అందరూ భగవంతుని బిడ్డలే! అందరికి భగవంతుడు ప్రభువే! రూపనామములయందు లేక సిద్ధాంతములయందు వేరువేరుగా మనకు కనుపించవచ్చు. కానీ తండ్రి ఒక్కడే! ఇలాంటి ఏకత్వమును మనము గుర్తించుకోటమే నిజమైన బ్రహ్మ జ్ఞానము. బ్రహ్మజ్ఞానమనగా ఒక ప్రత్యేకమైన పరిశ్రమ కానేరదు. అనేక గ్రంథములు చదివి వాదోపవాదములలో మునిగి బ్రహ్మతత్త్వమును గుర్తించినంత మాత్రమున మనము బ్రహ్మ జ్ఞానులము కానేరము. ఈ ప్రపంచమునందున్న ప్రతి జీవికూడను బ్రహ్మస్వరూపమనే సత్యాన్ని మనము గుర్తించాలి. ఈ అనేకత్వములో వుండిన యేకత్వమును మనము దర్శించాలి. ఈ సత్యాన్ని గుర్తించటమే నిజమైన బ్రహ్మజ్ఞానము. ఏదో బ్రహ్మజ్ఞానమని చెప్పి తలభారమైన పుస్తకములు చదువుకొని తలలోకి చేర్చుకొని మస్తకాన్నికూడ పుస్తకముగా మార్చుకొనే మార్గమున తాను బ్రహ్మజ్ఞాని కాలేడు. 'చెప్పవచ్చు కోటి, చెయ్యరు ఒక్కటి' ఎవరైనా సరియే తాను చదివినది, తాను విన్నదానిని కొంతవరకునైన ఆచరణలోపెట్టి యితరులకు అందించటానికి ప్రయత్నించినవాడే నిజమైన సిద్ధాంతి, నిజమైన ఆసక్తి కలిగినవాడు. ఈనాడు సిద్ధాంతములనుబట్టి వాదించుకోటంలో కాలము వ్యర్థము గావించినవారు మనకు అవసరం లేదు. ఆచరణాత్మకమైన సిద్ధాంతి కావాలి. యీనాడు సమాజములోపల సత్యమైన, ధర్మమైన సూత్రములను అమాయకులైన ప్రజలకు అందించి వారికి బోధించి వారిలో మానసిక పరివర్తనను గావించి తద్వారా సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టాలి.

**జాతి.మత,కుల భేదములు పెంచుకుని మానవత్వమును కించపరచరాదు**

ఒక చిన్న ఉదాహరణము. స్వధర్మమే సరైన శ్రేయస్సని, పరధర్మమనేది భయంకరమని భగవద్గీతలో వాక్యము. ఏమిటి స్వధర్మము? 'స్వ' అనగా ఆత్మ. 'ఆత్మ ధర్మమే స్వధర్మము' అని దానిని అనుసరించటంచేత జీవితము నిరంతరము శ్రేయస్సుగానే వుంటుంది. ఎట్టి ప్రమాదములకు గురికాదు. ఎట్టి అశాంతిని అందించదు. పరధర్మము అంటే ఏమిటి? 'పర' అనగా పాప, పుణ్యములకు మూలకారణమైన కర్మలు ఆచరించేది దేహము. 'దేహధర్మమే పరధర్మము'. ఏ కర్మలు ఆచరించినప్పటికిని ఆ కర్మ ఫలములు అనుభవించే నిమిత్తమై

sri sathyasai vahini

తిరిగి పునర్జన్మ ఎత్తవలసి వస్తుంది. కనుక తిరిగి తిరిగి జననం; మరణం; జననం; మరణం. ఈ విధమైన మార్గమును అనుసరించటంచేత భయంకరమైన ఏ స్థితిలో, ఏ కాలములో, ఏ విధమైన స్థితి అనుభవిస్తామో మనకు తెలియదు. కనుకనే యిది భయంకరమైనదని చెప్పడం జరిగింది. కానీ ఈనాడు భగవద్గీతయొక్క శ్లోకాన్ని మనము యేరీతిగా అర్థము చేసుకుంటున్నాము? స్వధర్మమంటే యితను క్షత్రియుడు, ఇది క్షత్రియ ధర్మమని మనము భావిస్తున్నాము. కాదు కాదు ఇక్కడ క్షత్రియ ధర్మము, శూద్ర ధర్మము అనేది ఏ వ్యక్తిని గురించికూడను చెప్పబడలేదు. గుణ, కర్మలనుబట్టి వర్ణములు ఏర్పడినాయి. తమోగుణముతో, మూర్ఖత్వముతో అనుభవించేవారు ఎప్పుడుకూడను వారు జన్మచేత బ్రాహ్మణులైనా శూద్రులే! సాత్త్వికమైన దైవచింతనచేత సత్కర్మలు, సదాలోచనలు, సత్ చింతనలచేత తనయొక్క జీవితమును సార్థకము గావించుకొనేవాడు ఏ కులమునందు వుండినప్పటికి వాడు బ్రాహ్మణుడే! బ్రహ్మ జిజ్ఞాస గావించేవాడు, బ్రాహ్మణుడు. కనుక, యీ జాతి మత కుల భేదములు వుంచుకొని, వాదోపవాదములచేత మానవత్వాన్ని మనము కించపరచటానికి ప్రయత్నించరాదు. అందరూ సోదర సోదరీమణులే! ఇలాంటి పవిత్రమైన భావములను సమాజములో మనము యినాడు ప్రచార, ప్రబోధలు చేయటానికి సంసిద్ధముగా వుండాలి. అప్పుడే ఆధ్యాత్మికము చాలా అభివృద్ధిలోకి వస్తుంది. భారతీయ సంస్కృతి కేవలము స్వల్పధనముచేత చేకూరునది కాదు. కాలముచే మారక, చరిత్రచే మాయక, ఏ సత్యమైతే నిలిచి వున్నదో ఆ సత్యానికి దివ్యస్వరూపమే భారతీయ ధర్మము. ఇది నిత్య సత్యమైన ధర్మము. మార్పులేని ధర్మము. కూర్చుటకు వీలుకాని ధర్మము. ఇలాంటి సత్యధర్మములను మనము గుర్తించుకొనలేక ఏదో నా మతము నీ మతమని మతులనంతా పాడుచేసుకుంటున్నాము.

**మతములన్ని చేరి మంచినే బోధించె**
**తెలిసి మెలగవలెను తెలివితోడ**
**మతులు మంచివైన మతమేది చెడ్డది**
**వినుడు భారతీయ వీరసుతుడ**

**మనం చేసే సర్వకర్మలు చిత్తశుద్ధి నిమిత్తమే!**

కనుక, మతులను పాడుచేసుకోటానికి ప్రయత్నము చేయరాదు. మతిని చక్కదిద్దుకోటానికి తగిన కృషి చేయాలి. అన్ని మతములుకూడను ఒక గ్రామమునకు మార్గములు వేరువేరైనట్టుగా యీ మతములు వుంటున్నాయి. మన భక్తి కృత్రిమమైన రీతిగా రూపొందరాదు. సక్రమమైన మార్గమును అనుసరించాలి. సత్యమైన ఆచరణలో మనము దిగాలి. నిత్యానందము పొందుటకు ప్రయత్నించాలి. అప్పుడే మన సాధన సార్థకమవుతుంది. అట్లు కాకుండా కేవలము 'చిత్తము శివునిపైన, భక్తి చెప్పులపైన' అన్నట్లుగా మన మనస్సు యెక్కడో వుంచుకొని జపమాల త్రిప్పుతే వచ్చిన ప్రయోజనం ఏమిటి? ధ్యానములో కూర్చుంటే వచ్చిన ప్రయోజనమేమిటి? కనుక బోధనలను విని, యీ బోధలచేత నీ బాధను దూరము చేసుకొని, చిత్తశుద్ధిచేత నీ మనస్సును భగవంతునిపై మరలించటానికి ప్రయత్నించాలి. 'చిత్తస్యశుద్ధయే కర్మః.' మనము చేసే సర్వకర్మలు కూడను చిత్తశుద్ధి నిమిత్తమే! ఆ చిత్తశుద్ధి దేని నిమిత్తము? దైవాన్ని ఆనందముగా అనుభవించటానికి. మనమెక్కడైనా కోరికలకోసం లైనులో పోయి కూర్చున్నామంటే ఒక చిన్న చాపనో, పేపరో ఏదో ఒకటి వేసుకుని కూర్చుంటున్నాం. యీ దేహము మట్టి రూపమైనది. ఇలాంటి దేహమే ఎక్కడైనా ప్రదేశములో కూర్చోవాలంటే దానికి పరిశుభ్రమైన ప్రదేశమును వెతుక్కొంటున్నాము. నిర్మల, నిశ్చల, నిస్వార్థపరుడైన భగవంతుడు మన హృదయములో కూర్చోవాలనుకుంటే మన హృదయము పరిశుద్ధముగా వుండనక్కరలేదా? మలినమైన హృదయములోపల భగవంతుడు ఏరీతిగా కూర్చోగలడు? కనుక, భగవంతుని ప్రతిష్ఠింపచేసుకోవాలనుకుంటే నీ చిత్తమును శుద్ధి గావించుకోవాలి. అదే నీవు సాధనలద్వారా చేయవలసిన పని. ఈ సాధనలచేత భావములను మార్చుకోటానికి పూర్తి ప్రయత్నం చేయాలి. కేవలము వినటము, బయటకు పోవటము యింత మాత్రముతోనే మనకాలము వ్యర్థము గావించరాదు. కాల కర్మలను పవిత్రము గావించాలి.

**ప్రేమ స్వరూపుడైన పరమాత్మను ప్రేమద్వారానే పొందాలి**

కాలము భగవత్ స్వరూపము. అలాంటి భగవత్ స్వరూపమైన కాలమును వ్యర్థము గావించటము కేవలము దివ్యత్వమును వ్యర్థము గావించటమే! కనుక మీరు యింత కాలము



srisathyasaivachanamrutam

నాలుగు గంటలనుండి ఆరు గంటలవరకు కూర్చొన్నందుకు తగిన సార్థకత, యీ కాలములో మీరు విన్న విషయములు కొన్ని ఆచరణలో పెట్టినప్పుడే అవుతుంది. యీ కులమత భేదములు దూరము నెట్టండి. దైవాభిమానమును మీరు అభివృద్ధి గావించుకోండి! అనాసక్తిని మనము పోషించుకోవాలి. గుణ లక్ష్మిని ఆనందముగా అనుభవించాలి. ఇది త్రిగుణాతీతమైన మార్గము. భగవంతుడు త్రిగుణాతీతుడు. ప్రకాశవంతమైన చంద్రుని చూడాలనుకుంటే టార్చిలైటో, పెట్రామాక్సులైటో మనకు అవసరము లేదు. చంద్రుని వెలుతురు ఆధారముచేతనే చంద్రుని చూడాలి. కనుక ప్రేమస్వరూపమైన పరమాత్మను ప్రేమద్వారానే పొందాలి. సత్యస్వరూపుడైన పరమాత్ముని సత్యముద్వారానే పొందాలి. ధర్మస్వరూపుడైన పరమాత్మను ధర్మముద్వారానే అనుభవించాలి. కనుక యీ ధర్మమును, సత్యమును, ప్రేమను ప్రధానమైన లక్ష్యము నందుంచుకొని సర్వసంగ పరిత్యాగులుగా క్రమక్రమేణా మారుతూ యీ సత్యమునే మన లక్ష్యము నందుంచుకోవాలి. అనేకమంది మహనీయులందరుకూడను చక్కగా చల్లని మాటలచేత, చిన్న చిన్న పదములచేత మీరు చక్కగా నిత్యజీవితములో అర్థము గావించుకొనే ఉపమానములచేత ఎన్నో విధములైన మార్గములు బోధిస్తూ వచ్చారు. ఈ బోధలను ఆచరణలో పెట్టినప్పుడే వారు బోధించిన కాలము, మీరు విన్నకాలము పవిత్రము చేసుకున్నవారౌతారు. అదే యీ చెప్పినందుకు, మీరు విన్నందుకు సార్థకము. యిలాంటి అవకాశము మీకు చాలా అదృష్టముగా లభించినది. ఈ అవకాశమును మీరు సద్వినియోగము చేసుకోవాలి. ఏ ఒకటి రెండైనా మీరు ఆచరణలో పెట్టి మీరు సరైన మార్గాన్ని అనుసరించండి.

**(తేదీ. 08-01-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam